తెలుసుకున్న తరువాత ఏ శాంతిని, ఆనందాన్ని పొందినతరువాత దానికి మించిన శాంతికాని, దానికి మించిన ఆనందముకాని లేదని తెలుస్తుందో అక్కడికి మేలుకో నారదా" అని చెప్పాడు. సనత్ కుమారుడు కంటే రామకృష్ణుడు డైరెక్టు ఎక్స్‌ప్రెషన్‌లో చెప్పాడు. ఏదైతే నువ్వు నేను, నేను అనుకుంటున్నావో ఆ నేను నేనుకాదని తెలుసుకోవటమే జ్ఞానమని ఒక్కమాటలో చెప్పాడు. అంటే చాందోగ్యోపనిషత్తులో గుంజుకుని, గుంజుకుని చెప్పింది రామకృష్ణుడు ఒక్కవాక్యంలో చెప్పేసాడు. రామకృష్ణుడు చెప్పినవి, భగవాన్ చెప్పినవి అవి ఎంగిలి ముక్కలుకాదు అది వారి అనుభవం. దుఃఖ స్పర్శ కూడా లేనివిద్యని బోధించటం అందరికి సాధ్యముకాదు. దుఃఖస్పర్శలేని విద్యని బోధించేవారని బోరన్ టీచర్స్ అని అంటారు. రామకృష్ణుడు, రమణుడు ఇద్దరూ ఇంచుమించు చదువులేనివాళ్ళు. కానీ ఇద్దరూ వరల్డ్ టీచర్సే. అయితే మనకి అతి పరిచయం ఉండటం వలన వారివిలువ తెలియటంలేదు. రామకృష్ణుడు నిన్నకాక మొన్నవాడు కాబట్టి ఆయన విలువ మనకి తెలియదు.

భారతదేశంలో జన్మించిన గణితశాస్త్రవేత్తలలో శ్రీనివాసరామానుజం ఒకడు. రామానుజం బహు బీద కుటుంబంలో జన్మించాడు. ఆయన 4వ తరగతి చదువుకునేటప్పుడు నీ అరిచేతులు బొబ్బలు ఎక్కిపోయి దళసరిగా ఉన్నాయి ఏమిటి? అని ఆయన స్నేహితుడు అడిగాడు. పలకమీద లెక్కలు చేయటం, చెరిపేయటం, లెక్కలు చేయటం, చెరిపేయటం అందుచేత నా చేతులు ఇలా తయారయ్యాయి అన్నాడు. ఎందుకు ఒక దస్తా కాగితాలు, పెన్ను కొనుక్కుని రాసుకోవచ్చు కదా అంటే దస్తాకాగితాలు, పెన్ను కొనుక్కోవటానికి నా దగ్గర డబ్బులు ఉంటేకదా అన్నాడు శ్రీనివాసరామానుజం. అంటే అంత బీదకుటుంబంలో జన్మించాడు. అంత మేధావి లెక్కల్లో ఫెయిల్ అయిపోయేవాడు. ఎందుకంటే పది లెక్కలు ఇచ్చి ఎనిమిది లెక్కలు చెయ్యమంటే, ఆ మొదటి సమ్ ఎన్ని మోడల్స్‌లో చేయవచ్చో అన్ని మోడల్స్లూ చేసేసేవాడు. ఒక లెక్క అయ్యేసరికి టైము అయిపోయేది. ఈలోపు పేపరు తీసేసుకునేవారు. కాని ఇంత మేధావికి మార్కులు ఎక్కువ వేద్దాం అంటే ఎగ్జామినేషన్ రూల్స్ అంగీకరించవు. రామానుజన్ గణితానికి చాలా కంట్రిబ్యూషన్ ఇచ్చి మన దేశానికి మేథమెటిక్స్ ద్వారా గౌరవాన్ని పెంచాడు.

మీకు ప్రతీరోజూ ఒక గంట అయినా ఏకాంతవాసం అవసరం. ఎందుచేతనంటే

నువ్వు ఏకాంతంగా కూర్చుని నీ మనస్సులో ఏమి జరుగుతుందో డైరెక్టుగా నీ మనస్సుని ఫేస్ చేస్తే అప్పుడు నీలో ఉన్న ప్లస్‌పాయింట్స్ ఏమిటో, నీలో ఉన్న మైనస్‌పాయింట్స్ ఏమిటో నీకు తెలుస్తాయి. ఇతరుల గొడవ నీకు అనవసరం. నీ బలహీనతలు ఏమిటో నువ్వు చూచుకొని ఆ బలహీనతలని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చెయ్యి. చాలామందికి ఏకాంతవాసం అంటే ఇష్టం ఉండదు. ఎందుకు అంటే వాళ్ళని వాళ్ళు చూసుకునేటప్పటికి భయంవేస్తుంది. భయంవేసి పదిమందిలోకి వెళ్ళిపోతారు. అందరితో కలిసి ఎక్కడో ఒకచోట కూర్చుని కాలక్షేపం కబుర్లు చెప్పకుంటారు. నీ సంగతి పదిమందిలో ఉన్నప్పడు ఏమి తెలుస్తుంది. ఏవో ఇతరుల గురించి చెప్పకుని ఇళ్ళకి వెళ్ళిపోతున్నారు. మీ మనస్సు ఏదో ఒక రూపం గురించో, నామం గురించో ఆలోచిస్తూ ఉంటుంది. రూపనామాల్ని విడిచిపెట్టేసి మీ మనస్సు ఉండలేదు. మన శరీరానికి ఆహారం ఎటువంటిదో అహంకారానికి నామరూపాలు అటువంటివి. మీరు ఇంటికి వెళ్ళి చూడండి. అది మీ రూపం గురించి, మీ నామం గూరించి ఆలోచిస్తూ ఉంటుంది. లేకపోతే మీ దేహానికి సంబంధించిన చుట్టాలు, స్నేహితులు ఉంటారు కదా వాళ్ళ గురించి ఆలోచిస్తూ ఉంటుంది. ఈ అహంకారానికి ఏదొక మేత ఉండాలి. కొంతమంది చనిపోయేటప్పడు వాళ్ళని చూడలనిఉంది, వీళ్ళని చూడాలనిఉంది తీసుకురమ్మంటారు. అంటే ఆ రూపం మీద వారికి ఉన్న భ్రాంతి. మీకు ఎవరిమీద అయితే మమకారం ఉందో వాళ్ళ గురించి ఆలోచిస్తారు. వాళ్ళ జీవితాలు ఎలా ఉంటాయో నేను చనిపోతున్నాను వాళ్ళని ఎవరు చూస్తారు అని అనుకుంటూ ఉంటారు. ఈ పనులన్నీ చేసేది అహంకారము. మీరు ఇది జ్ఞాపకం పెట్టుకోండి. అహంకారం ఉన్నంత సేపు పునర్జన్మ వచ్చి తీరుతుంది. నామరూపాలే ఈ అహంకారానికి మేత. రూపమూ కల్పితమే, ఆ రూపానికి పెట్టిన పేరూ కల్పితమే. ఈ కల్పితాలని పట్టుకొని అహంకారం వేలాడుతూ దాని బలాన్ని పెంచుకుంటుంది. రూపచింతన, నామచింతన లేకుండా అహంకారం ఉండలేదు. రూపమును పట్టుకుని పుట్టును, రూపమును పట్టి పెరుగుతూ ఉండును, రూపమును స్మరిస్తూ చనిపోవును. అంటే శరీరం పోయేటప్పడు కూడా నా శరీరం చనిపోతోంది అని బాధపడేది నీ మనస్సే.

అక్షరమణమాలలో భగవాన్ ఏమన్నారు అంటే ఇప్పడు నేను లోకం పిచ్చి వదిలేసాను.

నాకు లోకం మీద మోహం ఏమీ లేదు. ఇప్పుడు నీ మోహం పట్టుకుంది నాకు. నీ మీద ఉన్న మోహం పోతేనేగాని నా స్వరూపం తెలియదు. నువ్వు నాకు వేరుగా కనిపిస్తున్నావు. నువ్వు నాకు స్వరూపంగా కనబడాలి. నువ్వు వేరు, నేను వేరు అనే బేధబుద్ధి రాకూడదు. బేధబుద్ధి పోవాలంటే అది నా తెలివితేటల వలన పోగొట్టుకోలేను, దానిని నువ్వే పోగొట్టాలి. బేధబుద్ధి వస్తే అది పరమస్థితికాదు. బేధబుద్ధి ఉన్నప్పుడు మళ్ళీ ఏదో వరాలు అడగాలి అనిపిస్తుంది. నాకు అబేధబుద్ధి రావాలంటే నువ్వు స్వరూపంగా వ్యక్తమవ్వాలి అని ఆయన అక్షరమణమాలలో ప్రార్థించారు.

తపస్సు అంటే ఉపనిషత్తులలో మాటలు చూచి మీరు కంగారుపడకండి. తపస్సు అంటే నీ మనస్సుని నియమించుకోవటం, నీ మనస్సుని నిగ్రహించుకోవటం, ఎవరు ఎంత ఉద్రేకపరచినా మీ మనస్సును కూల్‌గా ఉంచుకోవటం, సహనంగా ఉండగలగటం అది తపస్సు. సత్వగుణం దేవుడు కాకపోయినా దేవుడితోటి సమానం. సత్వగుణం నిన్ను దేవుడి దగ్గరకి చేరుస్తుంది. మనిషికి యాక్షన్ అవసరమేకాని రియాక్షన్ పనికిరాదు. వేమన అంటాడు "కంచుమోగునట్లు కనకమ్ము మోగునా" అని. కంచు గొడవ గొడవ చేసేస్తుంది. కానీ బంగారము అలా మోగుతుందా? బంగారము అలా మోగదు. మోగనంత మాత్రంచేత దాని విలువ తక్కువలేదు. మీరు కంచు ఉన్నట్లు ఉండకండి, బంగారం ఉన్నట్లు ఉండండి. మీరు వాగుడుని బట్టి, మోతనిబట్టి వస్తువుకి విలువకట్టవద్దు. నువ్వు ఏపని చేసినా అది నీ దేహాభిమానం తగ్గటానికి ఉపయోగపడేలాగ పనిచేస్తూ ఉంటే కొంతకాలానికి నువ్వు పరిశుద్ధుడవు అవుతావు. బుద్ధిలో ఉన్న దోషాలలోంచి విడుదల పొందుతావు. అప్పుడు స్వరూపసుఖాన్ని పొందుతావు. చాలామంది మాకు శాంతిలేదు అని అడుగుతారు. మీ కోరికలు నెరవేరినప్పుడు తాత్కాలికంగా శాంతి వస్తుంది. కాసేపు జపం చేస్తే, ధ్యానం చేస్తే శాంతిగా ఉంటుంది. ఇవన్నీ టెంపరరీ విషయాలు. సముద్రాన్ని భగవంతుడి కింద, నదిని జీవుడు కింద పోలుస్తారు. నది రకరకాలుగా, వంకర్లు, వంకర్లుగా తిరిగి సముద్రంలో కలుస్తుంది. నదికి సముద్రంలో ఐక్యమయ్యాక శాంతి. నది ఎన్ని వంకర్లు తిరుగుతుందో అలాగే నీ జీవితంలో ఎన్ని అప్స్ డౌన్స్ ఉన్నా, నది సముద్రంలోకి వెళ్ళాక ఎలా శాంతిగా ఉంటుందో అలాగే నీ హృదయంలో ఉన్న ఆనందసాగరంలో ఈ మనస్సు వెళ్ళి ఐక్యమైనరోజున

నీకు శాంతిగాని ఈలోపులో శాంతిరాదు. ఒకవేళ తాత్కాలికంగా శాంతి వచ్చినా అది శాంతి కింద కనిపించే అశాంతి.

మీరు మంచి పనులు చేస్తూ ఉంటే మీకు ఎవరికీ దారిద్ర్యం రాదు. ఏదైనా చెడ్డ అలవాట్లు ఉన్నవాడికి దారిద్ర్యం వస్తుంది. ఆర్థికపరమైన క్రమశిక్షణ లేనివాడికి దారిద్ర్యం వస్తుంది. దీనికి స్వామి శివానంద అన్నారు "నీకు దాహంగా ఉంటే గంగానదిలోకి వెళ్ళి మంచినీళ్ళు తాగితే గంగలో ఉన్న నీరు అంతా అయిపోతుందా? అవ్వదు." అలాగే నీ సంపదలో పదిరూపాయలు ఏ పేదవాడికి అయినా సహాయం చేస్తే నీ సంపద అంతా అయిపోతుందా? మోర్ యు గివ్, మోర్ యు రిసీవ్. రమణస్వామి జ్ఞానమార్గం గురించే చెప్పారు అని అందరూ అనుకుంటారు. జ్ఞానమార్గాన్ని పునరుద్ధరణ చేసినమాట నిజమే. రుచిలేని పదార్థం, శుచిలేని పదార్థం ఎలా ఉంటుందో అలాగే భక్తిలేని జ్ఞానం అలా ఉంటుంది. భక్తిలేని జ్ఞానం డ్రైగా ఉంటుంది. రామకృష్ణుడు మాటలు ఎందుకు స్వీటుగా ఉంటాయి. ఆయన భక్తి కలపకుండా ఏదీ చెప్పడు. అందుచేత ఏమాటా డ్రైగా ఉండదు. మీ ముఖం సూర్యుడు వైపు తిప్పి ఉంటే తాత్కాలికంగా మేఘాల వల్ల సూర్యుడు నీకు కనిపించకపోయినా మేఘాలు తొలగిన వెంటనే సూర్యుడు కనిపిస్తాడు. వాడు భౌతికమైన సూర్యుడు. జ్ఞానసూర్యుడు మన హృదయంలో ఉన్నాడు. నీ ముఖం జ్ఞానసూర్యుడివైపు తిప్పి ఉండాలి. ఆయనవైపుకు మీ ముఖం తిప్పి ఉంటే, ఈశ్వరుడిపట్ల మీకు ఎంతో కొంత అభిలాష ఉంటే ఏదో టైములో మీకు అందరికీ మోక్షమే. మీరు అందరూ మోక్షం పొందటానికి అర్హులే. కాని మీరు కళ్ళు మూసుకొని సూర్యుడు లేడు అంటే ఎలాగ? మీ మనస్సు హృదయాభిముఖంగా తిప్పి ఉంచితే సరిపోతుంది. ఈరోజు కాకపోయినా రేపటిరోజు అయినా, ఈ జన్మలో కాకపోయినా, రాబోయే జన్మలో అయినా మీకందరికీ మోక్షం కలుగుతుంది. మీరు అందరూ ఆత్మజ్ఞానానికి అర్హులే అని రామకృష్ణుడు ఒక సందర్భంలో చెప్పాడు.

**గిరి రూపమైనట్టి కరుణాసముద్రమా**

**కృపజేసి నన్నేలు మరుణాచలా!**

నువ్వు గిరి రూపంలో ఉన్నావు. నువ్వు పైకి రాళ్ళగుట్టలాగ కనిపిస్తున్నావు. కానీ నువ్వు కరుణాసముద్రుడవు. మా కళ్ళకి రాళ్ళగుట్టలాగ కనిపిస్తున్నావు కానీ నువ్వు జ్ఞానగిరివి. మీరు గిరిని నిరంతరము స్మరించటంవలన, దానిని నిరంతరము మీరు రిమంబరెన్స్‌లో పెట్టుకోవటం వలన మనస్సు పల్చబడిపోతుంది. పల్చబడ్డాక మనస్సు చిరిగిపోతుంది. నిన్ను నిరంతరమూ చింతిస్తూ ఉంటే మాకు నీ అనుగ్రహం దొరుకుతుంది. నీ దయవల్ల మాకు జ్ఞానం కలుగుతుంది. ఎవరు ఎన్ని సాధనలు చేసినా ఈశ్వరుని అనుగ్రహం లేకుండా మనం మోక్షాన్ని పొందలేము. మనం ఎవరినైనా చూస్తే శరీరాలని చూస్తాం. వాళ్ళ శరీరాలని బట్టి వాళ్ళు ఎలాంటివారో నీకు తెలియదు. లోపలకి చూడు. వాళ్ళు లోపల ఎలా ఉన్నారో చూస్తే వారి గురించి నీకు తెలుస్తుంది. అలాగే ఈ కొండ ఏమిటి? ఈ దేవుడు ఏమిటి? అని మీరు అనుకోవచ్చు. కానీ మీరు లోపలికి చూడండి. అది చేసే పని ఏమిటో చూడండి. అరుణాచలేశ్వరుడు చేసే పని సైలెంటుగా చేస్తాడు. వాడు చేసే పని ఇతరులకు తెలియాలి అని అనుకోడు. మీరు ఒకసారి అరుణాచలేశ్వరుడి దయలో పడితే అది పులి నోట్లో పడ్డ మాంసపు ముక్క. పులి నోట్లో పడ్డ మాంసపు ముక్క ఎలాగైతే బయటికి రాదో అలాగ అరుణాచలేశ్వరుడి అనుగ్రహంలో పడ్డవాడు బయటికి రాలేడు. వాడు తరించబడతాడు.

**కుత్రమంతయు గోసి గుణముగ పాలించు**

**గురు రూపమైవెలు గరుణాచలా!**

నువ్వు నా మనస్సుని పరిశుద్ధం చెయ్యి. బట్టకి రంగు అంటుకోవాలంటే ముందు బట్టని పరిశుద్ధం చెయ్యాలి. బట్టని పరిశుద్ధం చేసాకే దానికి రంగుపూస్తారు. అలాగే నువ్వు నన్ను జ్ఞానంతోటి అలంకరించేముందు నాలో ఉన్న ఫారిన్ మేటర్ అంతా తీసేయి అరుణాచలేశ్వరుడా. మన ప్రవర్తన ఎలా ఉండాలి అంటే ఈశ్వరానుగ్రహం సంపాదించటానికి అనుకూలంగా ఉండాలి. నువ్వు జపం చేసినా, ధ్యానం చేసినా ఈశ్వరానుగ్రహానికి పాత్రుడవు అవ్వాలి. మనమాట, చేత, మనస్సు ఈ మూడూ నిదానంగా ఉండాలి, సమన్వయంగా ఉండాలి. సమన్వయంగా ఉంటేనే ఈశ్వరుడి దయకి పాత్రుడవు అవుతావు. నీ మనస్సులోకి వచ్చే తలంపులు, నువ్వు మాట్లాడేమాట, నువ్వు చేసేపనులు ఈశ్వరుని అనుగ్రహానికి, ఈశ్వరుని దయకి అనుగుణంగా ఉండాలి కానీ లోకానికి అనుగుణంగా కాదు. మీరు ఒక

మంచి పని చేయవచ్చు. అది గౌరవం కోసం చేసారా? కీర్తి కోసం చేసారా? పని పని కోసమే చేసారా? అని పరిశీలించి చూస్తే చాలామంది ఏదో కీర్తి కోసమే చేస్తారు. మిల్టన్ పేరడైస్‌లాస్ట్‌లో ఏమని రాసాడు అంటే సాధన చేసి సాధన చేసి కామక్రోధాలు పోగొట్టుకోవచ్చు కాని కీర్తి కాంక్ష పోగొట్టుకోవటం కష్టం అని చెప్పాడు. కీర్తికాంక్ష ఉన్నా నీ మనస్సుకి లోచూపు కలగదు. మీకు లోకవాసన పెరుగుతుంది. మనిషికి ఆత్మజ్ఞానం కలగకపోవటానికి మూడే శత్రువులు. 1 దేహవాసన, 2. లోకవాసన, 3. శాస్త్రవాసన. మనం దేహానికి, లోకానికి, శాస్త్రానికి అతి సమీపంలో ఉంటున్నాము. భగవంతుడికి దూరంగా ఉంటున్నాము. మన స్వరూపానికి మనం దూరంగా ఉంటున్నాము. మనకి ఆత్మజ్ఞానం కలగకపోవటానికి కారణం అదే. భగవదనుగ్రహం లేకుండా భగవదనుభవం కలగదు. ఇది సూత్రం.

ఒక పెద్ద వృక్షాన్ని నువ్వు మొయ్యటం చాలాకష్టం. అదే గోదావరి నదికి వరద వచ్చినప్పడు ఆ నదీ ప్రవాహంలో ఆ వృక్షం స్పీడుగా కొట్టుకుపోతుంది. అలాగే నీ హృదయంలో ఉన్న బరువైన బలహీనతలు నీ తెలివితేటలవల్ల పోగొట్టుకోలేవు. ఈశ్వరుని దయ కనుక నీకు ఉంటే, ఆయన దయకు నువ్వు డిజర్వు అయిఉంటే నీలో చెడు ఎంత ఉన్నప్పటికీ నదీ ప్రవాహంలో ఆవృక్షం ఎలా కొట్టుకుపోతుందో అలా ఈశ్వరానుగ్రహం అనే ప్రవాహంలో ఫారిన్ మేటర్ ఏది ఉన్నా, దేహాభిమానం ఉన్నా అంతా కొట్టుకుపోతుంది. మనకి ఏదైనా ఫారిన్ మేటర్ మన దేహంలో ఎంటర్ అయిన తరువాతే మనకి రోగం వస్తుంది. అలాగే నీకు దేహవాసనగాని, లోకవాసనగాని, శాస్త్రవాసనగాని నీ మనస్సులో ఎంటర్ అయిన తరువాతే నీ మనస్సు పొల్యూట్ అవ్వటం ప్రారంభమవుతుంది. మనం పెద్ద పెద్ద సాధనలు చెయ్యకపోయినా మనం దైనందిన జీవితంలో మన మైండు పొల్యూట్ అవ్వకుండా చూచుకోవాలి.

**అడుగకిచ్చెడు నీదు అకళంక మగుకీర్తి**
**హానిసేయక బ్రోవు మరుణాచలా!**

అరుణాచలేశ్వరుడికి ఏమని కీర్తి ఉందంటే ఎవరూ ఏమీ అడగకుండా, వాళ్ళకి ఏది అవసరమో అది ఇస్తూ ఉంటాడు. భగవంతుడు మన అవసరాలు తీర్చగలడు కానీ

మన ఆశ తీర్చలేడు. నా అవసరాలు నువ్వు తీరుస్తున్నావు. నాకు ఇది కావాలి అని నేను అడగను. ఎందుచేతనంటే నాకు ఏది అవసరమో నాకంటే నీకు ఎక్కువ తెలుసు. ఏపని చేయటం వలన నాకు జ్ఞానం కలుగుతుందో అది నాకంటే నీకు బాగా తెలుసు. అందుచేత నా శరీరాన్ని ఒక పనిముట్టుగా నీ చేతిలో పెడుతున్నాను. దీనిని ఎలా వాడుకోవాలో అలా వాడుకో అరుణాచలేశ్వరుడా. నాకు ఫలానాది కావాలని నిన్ను అడుగవలసిన పని లేదు అన్నారు భగవాన్.

అమెరికానుంచి ఒక అమ్మాయి ఫోన్ చేసి నాన్నగారూ నేను చదువుకునేటప్పుడు నాకు ధనకాంక్ష లేదు అనుకునేదాన్ని, నేను డబ్బుని దాటేసాను అని అనుకునేదాన్ని. కానీ పెళ్ళి అయ్యాక సంసారంలోకి వచ్చాక నాకు డబ్బు మీద ఆశ ఉందని తెలిసింది. మీ వెబ్‌సైట్ చూస్తున్నాను. నా రోగం నాకు అర్థమవుతోంది. రోగం అర్థమైతే సరిపోదుకదా, నివారణ కూడా ఉండాలి కదా. నివారణ ఏమిటి అంటోంది? గివ్వింగ్ హేబిట్ నాకు చిన్నప్పుడు ఉండేది. గివ్వింగ్ హేబిట్ ఇప్పుడు పోయింది. ఇప్పుడు బాబు ఒకడు పుట్టాడు. వాడి గురించి ఏదో సంపాదించాలని మళ్ళీ ప్రయత్నం చేస్తున్నాను. ఇదేమిటండి మాయ ఇంత దారుణంగా ఉంది. నా బుద్ధి పాడైపోయింది. నేను చిన్నప్పుడు ఏ బలహీనత అయితే లేదు అనుకున్నానో ఆ బలహీనత ఉన్నట్టు తెలుస్తోంది. దీనికి నివారణ ఏమిటి అని ఆ అమ్మాయి అడుగుతోంది. అప్పుడు నేను చెప్పాను అది ఈశ్వర ప్రణాళిక. నాకు ధనకాంక్ష లేదు అని అనుకోవటంలో నీ తప్పలేదు. అది నీకు తెలియకుండా నీ హృదయంలో బీజరూపంలో ఉంది. నీలో ఉన్న బలహీనత ఏదైనా పోగొట్టాలి అనుకుంటే దేవుడు అది నీ హృదయంలో కెలికి సహస్రారంలోకి తీసుకువస్తాడు. తలకాయలోకి వస్తేకాని ఆ వాసన నీకు ఉందని తెలియదు. నువ్వేం చేస్తావు మరి. నువ్వు చిన్నప్పటినుంచి నాకు తెలుసుకదా. నీకు దైవీ సంపద ఉంది. నువ్వు ఆత్మజ్ఞానానికి అర్హురాలివే. ఆ బలహీనత నీకు ఉందని తెలియకుండా దానిని ఈశ్వరుడు బయటకులాగడు. నీ బలహీనతను నీకు తెలియజేసి దానిని బయటకు లాగేస్తాడు, నిన్ను వాసనా శూన్యం చేస్తాడు. నువ్వు అమెరికాలో ఉన్నా, ఎక్కడ ఉన్నా అంతటా ఈశ్వరుడు ఉన్నాడు, ఆయన దేశకాలాలకి అతీతుడు. నిన్ను ఆత్మజ్ఞానానికి అర్హురాలుగా చేసి, దానికి నిన్ను ఫిట్ చేసిన తరువాత ఆత్మజ్ఞానం నీకు ప్రసాదిస్తాడు అని చెప్పాను. అప్పుడు

షి ఈజ్ సాటిస్ఫైడ్.

రామాయణంలో నతింగ్ ఈజ్ టూ హేవీ ఫర్ డెస్టినీ అన్నాడు. అంటే కాలప్రవాహంలో నీకు కోట్లాది రూపాయలు ఉన్నా కొట్టుకుపోతాయి. నీకు డబ్బు ఉండవచ్చు ప్రమాదం లేదు. దానితోటి తాదాత్మ్యం ఉండకూడదు. మీకు పాండిత్యం ఉన్నా ప్రమాదం లేదు. దానితోటి తాదాత్మ్యం ఉంటే మీకు గర్వం పెరిగిపోతుంది, మీరు పూర్తిగా పాడైపోతారు. మాకు ఒక కష్టం పోతే ఇంకో కష్టం వస్తోంది. ఒక బాధపోతే ఇంకో బాధ వస్తోంది. కోడలు రూపంలోనో, ఇంకో రూపంలోనో మాకు సఫరింగు తప్పటంలేదు అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. ఒక కష్టంపోతే ఇంకో కష్టం రావచ్చు. ఒక బాధ పోతే ఇంకో బాధ రావచ్చు. దీనికి ఒకటే మందు. సఫరర్‌ని తీసేయండి. సఫరర్‌ని బయటకు తీస్తే మీకు ఏ సఫరింగు వచ్చినా అది సఫరింగు కింద కనబడదు. అది సర్వరోగనివారిణి. అయితే ఈశ్వరానుగ్రహం లేకుండా ఆ సఫరర్‌ని, ఆ బరువైన రాయిని మీరు బయటకు లాగలేరు అన్నారు భగవాన్.

మన దేహప్రారబ్ధాన్ని బట్టి చుట్టాలు, స్నేహితులు దొరుకుతారు. ఓ అరుణాచలేశ్వరుడా! వంచకుల యొక్క స్నేహంలో పడి నేను శుభ్రంగా పాడవకముందే, కుళ్ళిపోకముందే, కాయ బాగున్నప్పుడే తిను. కుళ్ళిపోయిన కాయను నువ్వేం తింటావు. నేను పూర్తిగా కుళ్ళిపోకముందే నీ కరుణ నాయందు చూపించి నన్ను అనుగ్రహించి నీ ఒడిలోకి నన్ను తీసుకో అరుణాచలేశ్వరుడా! నేను పూర్తిగా పాడవకముందే నన్ను రక్షించాలి. ఈ భౌతికమైన దేహం స్మశానంలో కాలి బూడిద అవ్వకముందే నీ జ్ఞానాగ్నిని పంపించి ఈ దేహం మీద నాకున్న అభిమానాన్ని పోగొట్టు అరుణాచలా!

**కోపరహితగుణ గురిగాగ ననుగొను**

**కొఱయేమి చేసితి నరుణాచలా!**

నీ ఆగ్రహానికి గురి అయ్యే పనులు కూడా నేను చేయవచ్చు. అయినా కాని నువ్వు కోపరహితుడవు అని, నువ్వు చాలా బుద్ధిమంతుడవు అని లోకంలో ఒక ప్రసిద్ధి ఉంది. నా ప్రవర్తనలో పొరపాట్లు ఉన్నప్పటికీ నీకు కోపం లేదు కాబట్టి నువ్వు నన్ను తీర్చిదిద్ది, నా మనస్సుని వికసించేలాగ చెయ్యి అరుణాచలేశ్వరుడా! భగవంతుడికి రూపం ఉందా, రూపం లేదా

అని ఒకరు రమణమహర్షిగారిని అడిగారు. నీకే రూపం లేనప్పుడు ఆయనకి రూపం ఎలా ఉంటుంది. నువ్వు గాఢనిద్రలో ఉన్నప్పుడు నీకు శరీరానికి సంబంధించిన స్మృతి ఉందా? గాఢనిద్రలో వాడు బాడీలెస్, మైండ్‌లెస్, వరల్డ్‌లెస్, గాడ్‌లెస్ ఎవ్విరితింగ్ ఈజ్ లెస్. అక్కడ ఏమీ లేదు. కానీ వాడు మటుకు ఉన్నాడు. నీకే గాఢనిద్రలో శరీరంలేనప్పుడు, ఈశ్వరుడికి శరీరం ఎలా ఉంటుంది. నీకు కళ్ళులేకపోతే చూడలేవు. చెవులు లేకపోతే వినలేవు. కానీ ఈశ్వరుడు కళ్ళు లేకుండా చూడగలడు, చెవులు లేకుండా వినగలడు. ఈశ్వరుడికి రూపం అక్కరలేదు. నువ్వు చైతన్యాన్ని డైరెక్టుగా పట్టుకోలేవు కాబట్టి ఆ చైతన్యానికి రూపం కల్పించి ఆ రూపాన్ని నువ్వు ఆరాధిస్తున్నావు. నువ్వు ఆ రూపానికే పరిమితం అవ్వవద్దు. ఆ రూపానికి ఆధారంగా ఉన్న వస్తువుని పట్టుకో అన్నారు.

**సుఖ సముద్రము పొంగ వాఙ్మనములడంగ**

**యూరక సమరుమందరుణాచలా!**

నీకు ఎప్పుడైతే లోపల ఉన్న ఆనంద సముద్రం పొంగిందో, శాంతి సముద్రం పొంగిందో నీ వాక్కు అణిగి పోతుంది, నీ మనస్సు అణిగిపోతుంది. మొత్తం నీ ఇంద్రియ చేష్టలన్నీ అణిగిపోతాయి. మనస్సు అణిగినప్పుడు టెండన్సీస్ కూడా అణిగిపోతాయి. కానీ ఆ సుఖ సముద్రం పొంగాలి కదా. ఆ సుఖసముద్రం పొంగటానికి ఏ విషయాలు అయితే, ఏ అలవాట్లు అయితే నాకు అడ్డువస్తున్నాయో వాటిని తొలగించి నన్ను పరిశుద్ధుడను చెయ్యి అరుణాచలేశ్వరుడా!

**పేరు దలపగనె పట్టి లాగితివి నీ**

**మహిమ కనుదురెవరుణాచలా!**

అరుణాచలా అని నిన్ను స్మరించిన వెంటనే ఈ దేహం నాది అనే బుద్ధిని తీసేసావు. నా దేహాన్ని నాదికాకుండా, నామనస్సుని నాదికాకుండా చేస్తావని నేను అనుకోలేదు. అరుణాచలం అన్నాను అంతే. నేను ఏమీ యజ్ఞాలు, యాగాలు చేయలేదు, పుణ్యాలు ఏమీ చేయలేదు. అయినా నన్ను అనుగ్రహించి నన్ను నాకు కాకుండా చేసావు. నిన్ను స్మరించిన వెంటనే నా దేహబుద్ధిని తీసేసావు, ఆత్మబుద్ధిని కలగజేసావు. అనంతమైన నీ మహిమను ఎవరు తెలుసుకొనగలరు అరుణాచలా! అరుణాచలేశ్వరుడా నువ్వు ఏ రకమైన బలహీనతలు

లేనివాడవు. నీ బుద్ధిలో ఏరకమైన దోషం లేదు. సర్వజ్ఞుడవు అయినటువంటి నీలో నన్ను ఐక్యం చేసుకో. నీలో నన్ను ఐక్యం చేసుకొన్నప్పుడు మాత్రమే నాకు ఆనందం కలుగుతుంది, శాంతి కలుగుతుంది. నీకంటే నేను వేరుగా ఉన్నప్పుడు నాకు ఆనందం కలుగదు. మాయావిషము పట్టి తలకెక్కి చెడిపోకముందే నన్ను నువ్వు ముగ్గేటట్టు చేసి నన్ను అనుగ్రహించు అరుణాచలా. నీ అనుగ్రహాన్ని పొందటానికి ముందు నన్ను ప్రిపేర్ చెయ్యి. ప్రిపేర్ చేసిన తరువాత నేను డిజర్వు అయిన తరువాతే నన్ను అనుగ్రహించు అరుణాచలా!

మీరు పవిత్రులు అవ్వటానికి దేశంలో యాత్రలు అన్నీ చేస్తున్నారు కదా. కానీ ఒక్క నిమిషం అద్వైతానుభవం మీరు అనుభవిస్తే, అద్వైతానుభవం తాలూకు ఆసుఖం, శాంతి మీరు హృదయంలో అనుభవిస్తే, ఎంత పెద్ద గడ్డిమేటు అయినా చిన్న అగ్గిపుల్లకి లోకువ అలాగే పూర్వజన్మల్లో మీరు ఎన్ని మహాపాతకాలు చేసినా అవన్నీ జ్ఞానాగ్నిలో కాలిబూడిద అయిపోతాయి. అద్వైతానుభవం ముందు కాశీ ఎంత? రామేశ్వరం ఎంత? అరుణాచలం ఎంత? ఇవి అన్నీ ఏపాటివి? ఈశ్వరుడితోటి వన్‌నెస్ మనకు కలిగితే దానితోటి సమానమైన అనుభవంకాని, దానికి మించిన అనుభవంకాని లేనేలేదు. మీరు యాత్రలకి ఎక్కడకి వెళ్ళనక్కరలేదు. మీ జీవితలక్ష్యం అద్వైతానుభవం, ఈశ్వరుడితోటి వన్‌నెస్. ఈ రమణ జయంతి రోజున ఈ ఒక్క వాక్యం గుర్తుపెట్టుకోండి.

అసలు మానవుడు పొరపాటు చేయటానికి ఒకటే కారణం. ధర్మమార్గాన్ని వదిలేసినప్పడే పొరపాట్లు చేయాలి అనిపిస్తుంది. ఒకజాతికాని, ఒక కులంకాని, ఒకదేశం కాని, ఒక వ్యక్తికాని ధర్మమార్గాన్ని విడిచిపెట్టేశారా ఇంక మానవుడుకాని, దేశంకాని, ఆకులంకాని మిస్టేక్స్‌లో పడిపోతుంది. అంటే మనం ధర్మమార్గాన్ని వదిలేసాము అంటే తప్పనిసరిగా పొరపాటు ఆలోచనలు వచ్చేస్తాయి. మనం ఏవైనా పొరపాట్లు చేస్తున్నాము అంటే మనం మార్గం తప్పిపోయాము అని అర్థం. అందుకే ఏసు అంటాడు "నాకు తప్పిపోయిన గొఱ్ఱెలు అంటే బాగా ఇష్టం" అని. ధర్మమార్గంలో ఉన్నవాళ్ళకి నా దయ అక్కరలేదు. ధర్మమార్గం విడిచిపెట్టేసిన వాళ్ళు అని చెప్పకుండా తప్పిపోయిన గొఱ్ఱెలు అంటే నాకు బాగా ఇష్టం అన్నాడు. ధర్మమార్గాన్ని విడిచిపెట్టేసినవాళ్ళందరూ తప్పిపోయిన గొఱ్ఱెలు. వాళ్ళు చాలా సఫరింగుకి గురిఅవుతారు. వాళ్ళని మళ్ళీ తీసుకువచ్చి ధర్మమార్గంలో ప్రవేశపెట్టటమే నా జీవితలక్ష్యం.

# భక్తిని నిలబెట్టుకొన్నవారు పరమాత్మను పొందుతారు

కలికాలం కాలుష్యాలు, కల్మషాలు ఎక్కువ. తెలివివల్ల, యుక్తులవల్ల తరించటం చాలా కష్టం. ఈ సమాజం పైకి తేటతెల్లగా, తేనెలొలికే మాటలు మాట్లాడుతారు. మనస్సులో నలుపు కుళ్ళుమోతు తనం ఉంటుంది. కామ-క్రోధ, లోభాలతో మనస్సులో నిండా నింపుకుంటారు. నేర్పరి మాటలు అన్నీ దండుగ. కుయుక్తులతో కుళ్ళితే పక్షికూనలను గెద్ద తన్నుకొనిపోవటానికి కాచుకొని కూర్చున్నట్లు కాకలు తీరిన కాలపురుషుడు కాటికి చేర్చటానికి కాచుకొని ఉంటాడు. మనలను సాధకుడు సచ్ఛీలత, త్రికరణశుద్ధి అనే అద్దంలో మన మనస్సులోని మలినాలను చూచుకోవాలి. గురువాక్యాలను ప్రమాణంగా తీసుకొని జీవిస్తున్నామా? అని ఏ రోజుకారోజు జమా-ఖర్చు చూచుకోవాలి. సిరిసంపదలను చూచి గర్వం తెచ్చుకొంటే ఆపదల్లో మునుగుతాము. ఈ మోసం నుంచి తప్పకొని హెచ్చరికగా జీవించాలి. గురువు నాకు రక్షకుడుగా ఉన్నాడు అనే విశ్వాసం గలవాడే తరిస్తాడు. స్వామి శారదానంద గురువుపై ఈ గీతాన్ని ప్రీతిగా ఎన్నుకొన్నారు. “నా సర్వస్వం నీవే సర్వేశ్వరా - నా ప్రాణానికి ప్రాణం నీవే, నా జీవనాధారానికి సారం నీవే - నా అనువారు ఎవ్వరూ లేరు; నా అండదండలు, కలిమిబలిమి నీవే, నా ఇల్లు వాకిలీ, బంధువులు, మిత్రులు నీవే-నేడు రేపు నాకు నీవే - నా విరోధులు, హితులు నీవే తోడూ నీడా నీవే - నా మార్గం - గమ్యము నీవే, నా కర్తవు భర్తవు దైవము నీవే శిక్షించే తండ్రివి - లాలించే తల్లివీ నీవే ప్రపంచ సాగరమున - నా జీవన నౌకను నడిపే ప్రభువు నీవే - నా సర్వస్వమూ నీవే గురుదేవ”. ఈ ఆర్తి హృదయం నుంచి కన్నీటితో పొంగిపొరలితే మనో కల్మషాలన్ని కొట్టుకుపోతాయి. ఆయన అన్నారు “నేను ఎదుగుతున్నకొలది నా గురువును అర్థం చేసుకోవటం లేదని తెలుస్తున్నది అని. శ్రీ నాన్నగారు “మీ గురించి మీ గురువు ఎంత వేదన పడుతున్నాడో మీకు తెలియదు” అన్నారు. ఈ వాక్యం మన నరనరాల్లోనూ జీర్ణించాలి. రామకృష్ణుడు “నా చుట్టూ ఉన్న వారిని మహామాయ బంధించలేదు” అన్నారు. గోకులంలో గోపికలు శ్రీకృష్ణుని అలంకరించటం, అన్నం తినిపించటం, కన్నీరు కార్చటం, మొదలైన భక్తి వైఖరిని ఉద్ధవుడు మెచ్చుకోలేక హీనంగా మాయకు లోనైనారని భావించగా శ్రీకృష్ణుడు ఆయనకు గుణపాఠం చెప్పటానికి బృందావనానికి పంపాడు. గోపికలతో “మీరు కృష్ణా-కృష్ణా అని ఎందుకు పదే పదే వాపోతారు. ఆయన సర్వాంతర్యామి అని మీకు తెలియదా!” అనగా, గోపికలు “నీవు కృష్ణుని మిత్రుడవు, గొప్ప జ్ఞానివి నీవు ఇలా పలకటం సముచితమా? ధ్యానాలు చేసి, తపస్సులు చేసి ఆయన్ని పొందగలమా! అలా చేసే మనస్సు మాకుందా! శ్రీకృష్ణుడు పాదాలచెంత మా మనస్సును ఏనాడో సమర్పించాము. మాది అన్నది మాకు ఏమైనా ఉన్నప్పడే కదా! దానితో ‘నేను’ అనే భావాన్ని ఆరోపించి జప-ధ్యానాలు చెయ్యగలమా?” ఆ మాటలు విన్న ఉద్ధవుడు ఆశ్చర్యపోయి తలదించుకొని వెళ్ళిపోయాడు గత జన్మలో గోపికలు యోగులు అని తెలియక. “బ్రహ్మానుభూతికి ఆర్తి ముఖ్యమార్గం” అన్నారు భగవాన్. “ప్రేమపూరితమైన గురువు మనలను ఇరువది నాల్గు గంటలు కంటికి రెప్పలా కాపాడుతున్నాడు” అనే స్ఫూర్తి మన హృదయంలో నిండినప్పడే పై గురుభక్తి కీర్తన ఆలాపించగలం. తరించగలం.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**